సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ



బుధవారం । 8 । మార్చి । 2023

సాధికారత దిశగా అడుగులు



మహిళలు స్వయం నిర్ణయాధికారం తీసుకుని, సాధికారత దిశగా అడుగులు వేయాలి. ఎప్పుడూ కుటుంబం కోసమే కాకుండా తమ కోసం కొంత సమయం కేటాయించడం ద్వారా ఒత్తిడిని అధిగమించడం సాధ్యమవుతుంది. ఆధునిక కాలంలో మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా సమాజంలో ఎంతో కీలకమైన నిర్ణయాల్లో భాగస్వాములు అవుతున్నారు. లక్ష్యం నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కృషి చేస్తే విజయం తప్పకుండా సాధించగలం. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళల పేరు మీదే సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా వారికి ఒక గుర్తింపు తీసుకువచ్చింది. మన కోసం రోజులో కనీసం ఒక గంట సమయం ఆరోగ్యానికి కేటాయించడం తప్పనిసరి. మహిళలు సాధించలేనిదంటూ ఏమీలేదు.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా

ఆత్మస్థైర్యంతో ముందడుగు



మహిళా దినోత్సవం అంటే ఈ ఒక్క రోజే మహిళలు సాధించే విజయాలను తెలియజేస్తే సరిపోతుందనుకుంటే పొరపాటే. ప్రతి ఒక్కరు తోటి మహిళలను రోజూ గౌరవించాలి. మహిళల ఉన్నతికి విద్య కీలకమైన సాధనం. చదువుకుంటేనే పురోగతి ఉంటుంది. మహిళలు బహుముఖ ప్రజ్ఞాపాటవాలు కలిగిన వారు. గృహిణిగానే కాకుండా వివిధ రంగాల్లో పురుషులతో పోటీపడి పనిచేస్తుంటారు. వీరు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది. చిన్నచిన్న సమస్యలు ఎదురైనప్పుడు కుంగిపోకూడదు. ధైర్యంగా ఎదుర్కోవాలి..ప్రతి మహిళకూ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు.



డాక్టర్ కృతికాశుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ.

ఆమె ధైర్యం.. ఒక సైన్యం

- అన్ని రంగాల్లో అతివలకే అగ్రాసనం
- పాలనా పగ్గాలు చేపట్టి సత్తా చాటుతూ..
- పథకాల్లో మహిళలకు ప్రభుత్వం పెద్దపీట
- జిల్లా అధికారుల్లో అత్యధికులు వీరే



తానేటి వనిత
హోం మంత్రి



ఇలక్కియ
జాయింట్ కలెక్టర్

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఒకప్పుడు రంగాలకే పరిమితమైన మహిళలు నేడు అన్నింటా ముందడుగు వేస్తున్నారు. శక్తిసామర్థ్యాలను నిరూపించుకుంటూ ఔరా అనిపించుకుంటున్నారు. పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. అది ఇది ఏమని అన్ని రంగముల..అని మహిళల్ని కొనియాడుతూ దశాబ్దాల కిందట ఓ సినీకవి చెప్పిన మాట నిజమైంది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ..ప్రతికూలతలను అధిగమిస్తూ పురోగతి బాటలో పయనిస్తున్నారు. కష్టాలు చుట్టుముట్టినా చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటున్నారు. పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

మహిళా సాధికారత

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మహిళలకు అగ్రాసనమేస్తున్నారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళా సాధికారతకు గడచిన మూడున్నరేళ్లలో ఎన్నో కార్యక్రమాలు రూపొందించారు. అమ్మ ఒడి నుంచి నవరత్నాలు–పేదలకు ఇళ్ల వరకూ అన్ని పథకాల్లోనూ వారి ఖాతాలకే నగదు జమయ్యేలా చూస్తున్నారు. ప్రభుత్వమిస్తున్న ప్రోత్సాహాన్ని వారు కూడా అంది పుచ్చుకుంటున్నారు. మరో అడుగు ముందుకేస్తూ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. అలాగే పాలనలోనూ మహిళలను ముఖ్యమంత్రి కీలకం చేస్తున్నారు. ముఖ్యమైన హోం మంత్రి పదవిని తానేటి వనితకు కట్టబెట్టారు. ఎంపీటీసీ సభ్యురాలి నుంచి అన్ని పదవుల్లోనూ సగం కేటాయించారు. అంతేకాదు వివిధ పదవులకు వారే చైర్‌పర్సన్లుగా నియమితులయ్యారు. రుడా..కొడా చైర్‌పర్సన్లుగా మేడపాటి షర్మిల..రాగిరెడ్డి చంద్రకళాదీప్తిలను నియమించారు. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడవుతుంది.

పాలనలో పైచేయి

చదువుకుని చాలామంది మహిళలు ఉన్నతోద్యోగాలను పొందుతున్నారు. కాకినాడ కలెక్టరుగా కృతికాశుక్లా..తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా మాధవీలత జిల్లా పాలనాధికారులుగా సత్తా చాటుకుంటున్నారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇలక్కియా యువ అధికారిగా జిల్లా ప్రగతికి అంకిత భావంతో పనిచేస్తున్నారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కూడా ఎక్కువ మంది మహిళలే ఉండటం విశేషం. కాకినాడ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.శ్రీరమణి.. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రియంవద, డ్వామా పీడీగా అడపా వెంకటలక్ష్మి, బీసీ, ఎస్సీకార్పొరేషన్‌ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లుగా ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డీఎస్ సునీత, జిల్లా స్త్రీ

– మిగతా 8లో ▸



దిశ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

లక్ష్యం దిశగా శ్రమించాలి

పోలీసు రంగంలోకి నేను రావాలని ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా శ్రమించాను. ఐపీఎస్ చదివి పోలీసు అధికారిణి అయ్యాను. ప్రతీ మహిళా తనకు అనువైన రంగంలో ఎదిగేందుకు పునాదిగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మహిళలకు అంతర్లీనంగా శ్రమించే గుణం ఉంటుంది. ఎంతటి లక్ష్యాన్నైనా ఎన్ని అడ్డంకులు ఉన్నా అవలీలగా సాధించే తత్వం మహిళల్లో అధికంగా ఉంటుంది. అంతర్లీనంగా ఉండే ఆ శక్తినే ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని ఈ సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు నిచ్చెనలు వేసుకోవాలి. ఏ ఉన్నతికైనా విద్యే మూలం. ఆ విద్యను అభ్యసించేందుకు ప్రతీ మహిళా ముందడుగు వేయాలి. విద్యలో విజయం సాధిస్తే తర్వాత జీవితంలో మనకు నచ్చిన రంగంలో నిలదొక్కుకునేందుకు విజయావకాశాలు మన ముందు వాటికవే మోకరిల్లుతాయి. ఓర్పు, నేర్పు, కార్యదీక్ష, ఎందులోనైనా రాణించగలమన్న తెగువ మగువలోనే ఉంటాయి. వారికి ప్రోత్సాహం కుటుంబీకులు ముఖ్యంగా తల్లిదండ్రులు నుంచి తోడైతే విజయాలకు అడ్డే ఉండదు. డిగ్రీ లేదా పీజీ చదివేందుకు ఎలా లక్ష్యాలు పెట్టుకుంటామో... ఆ చదువుతో మనం ఏ రంగంలో ఎదగాలి..ఎలాంటి ఉన్నత స్థానం సాధించాలి ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే సమాజంలో ప్రతీ మహిళా అన్ని రంగాల్లో మరింత దూసుకుపోతుంది.



– కె.లతామాధురి, ఐపీఎస్, ఏఎస్పీ,
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



ఉప్పాడలో చేయూత మహిళా మార్టు

తమదైన మార్కుతో మహిళా మార్టు

పిఠాపురం: చేయి చేయి కలిపితే సాధించలేనిది లేదని ఆ మహిళలు నిరూపించారు. కార్పొరేట్ సంస్థలను తోసిరాజని మార్కెట్‌లో తమ దైన మార్కును నిలుపుకున్నారు. ఏ లక్ష్యంతో అయితే డ్వాక్రా సంఘాలు ఏర్పాటయ్యాయో అందుకు అనుగుణంగా సాధికారిత దిశగా ముందడుగు వేశారు. ప్రభుత్వం చేయూతనివ్వడంతో పెద్ద వ్యాపారానికి శ్రీకారం చుట్టి ఉప్పాడలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టు ద్వారా నవ శకానికి నాంది పలికారు. ప్రముఖ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని మార్టులో నాణ్యమైన సరకులు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. నిరుపేదలు కూడా కొనుక్కునేలా ప్యాకెట్లలో కాకుండా విడిగా కూడా అమ్మే ఏర్పాట్లు చేశారు. సేంద్రియ కూరగాయలు మాత్రమే విక్రయిస్తూ స్వచ్ఛమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారు.

రూ.200 పెట్టుబడితో అతి పెద్ద భాగస్వామ్యంగా..

చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకున్న మహిళలు అంతా ఒక్కటయ్యారు. ఏకంగా 44 వేల మంది ఒక వ్యాపార సంస్థగా మారారు. వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులు అతి తక్కువ ధరకు సమకూర్చుకోవడమే కాకుండా ఇతరులకు అందిస్తూ వ్యాపారాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. రిటైల్ రంగంలోకి అడుగుపెట్టిన వీరు మార్టు నిర్వహణ చేపట్టారు. ఒక్కో సభ్యురాలు రూ.200 పెట్టుబడితో ప్రారంభించి ఏకంగా రూ.44 లక్షల అతి పెద్ద పెట్టుబడిని సమకూర్చుకుని అందరికీ అందుబాటులో ఉండే మార్టును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ చేయూతతో పెరిగిన పరిశ్రమలు

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం మహిళా సంఘాలను ఏర్పాటు చేసింది. ఈ సంఘాలకు చేయూతగా స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ వంటి పథకాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతనిస్తోంది. దీంతోపాటు బ్యాంకు లింకేజీ కల్పించడంతో చిరు వ్యాపారాలు సైతం అనతి కాలంలోనే పెద్ద వ్యాపారాలుగా పెరుగుతున్నాయి.

ఉన్నతికి కృషి



ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకున్నాం. మహిళా మార్టు మా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రానికి ఆదర్శంగా మారింది. దీనిని రాష్ట్రంలో ఒక పెద్ద వ్యాపార సంస్థగా మార్చి ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అభివృద్ధి చేయడంలో ఇప్పటికే మేం సఫలీకృతమయ్యాం. మరింత ఉన్నతికి కృషి చేస్తాం.

– ఉప్పాడ ఎల్లేశ్వరి,
చేయూత మహిళా మార్టు చీఫ్ ప్రమోటర్, ఉప్పాడ.

రాష్ట్రానికి ఆదర్శం



ఉప్పాడ మార్టు ద్వారా నిత్యావసర సరకులు వినియోగదారులకు అందుబాటు ధరలో దొరుకుతున్నాయి. అతి తక్కువ కాలంలోనే ఊహించనంత టర్నోవర్ సాధించి వివిధ అంతర్జాతీయ వ్యాపార సంస్థలనే అబ్బుర పరుస్తూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారు మార్టు నిర్వహిస్తున్న మహిళలు.

– శ్రీరమణి,
గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ, కాకినాడ జిల్లా

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఉషారాణి



కొత్తపేట: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సత్తిరాజు ఉషారాణి నియమితులయ్యారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్‌కు చర్యలు

- కలెక్టర్ ఆదేశాలతో కదలిన అధికార యంత్రాంగం



ఎస్.యానం తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్ పనులపై చర్చిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ఉప్పలగుప్తం: తీర ప్రాంతంలో ఉన్న పర్ర భూములను డ్రెడ్జింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. కొన్ని రోజులుగా మండలంలోని ఎస్.యానం తీర ప్రాంతంలో తరచూ చేపలు చనిపోవడంతో 'సాక్షి' దినపత్రికలో 'నీటిలోని చేప నేల మీద పడ్డట్టు' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ హిమాన్షుశుక్లా స్పందించారు. ఆయన ఆదేశాలతో మంగళవారం ఆర్డీవో పర్రభూమిని సందర్శించారు. డ్రెడ్జింగ్ నిపుణులు కామ్‌రెన్, మత్స్యశాఖ జేడీ షేక్ లాల్‌మహ్మద్ తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తో కలసి తీర ప్రాంతం వెంబడి పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్.యానం పర్రకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాట్రేనికోన మండలం గచ్చకాయలపొర మౌత్ పాయింట్ వద్ద కూనవరం మేజర్ డ్రెయిన్ ప్రాంతం నుంచి ఎస్.యానం పర్రకు డ్రెడ్జింగ్ పనులు జరిపినా ఉపయోగం ఉండదన్నారు. అల్లవరం మండలం నక్కా రామేశ్వరం మౌత్ పాయింట్ నుంచి నాచుకోడుకు ఇప్పటికే అరకొరగా నీరు కదలిక ఉండటంతో ఆ ప్రాంతాన్ని 2.5 మీటర్ల లోతుతో 50 మీటర్ల వెడల్పుతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరం డ్రెడ్జింగ్ జరిపితే పర్రకు నీరు అందే అవకాశం ఉందన్నారు. మత్స్య సంపద చనిపోవటంపై ఇప్పటికే మట్టి, నీటి నమూనాల పరిశీలనకు ల్యాబ్‌కు పంపామని తెలిపారు.

ఆర్థిక పరిపుష్టితోనే సమాజాభివృద్ధి

మహిళా దినోత్సవంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం: మహిళలు స్వతంత్రంగా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ శుక్లా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహిళల ఆలోచన ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజ నిర్మాణంలో సగ భాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమని గ్రహించాలన్నారు. ఇదే నినాదంతో ఐక్య రాజ్యసమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించిందన్నారు. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయం, క్రీడలు, బ్యాంకింగ్, టెక్నాలజీ, అంతరిక్షం వంటి పలు రంగాలలో మహిళలు రాణిస్తూ సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. మానవ వనరుల సంపూర్ణ వినియోగంలో వీరి పాత్ర కూడా ఎంతో ఉందని, ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరుకుని పురుషుల శక్తికి తామేమీ తీసి పోమని చాటి చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రతి మగాడి విజయంలో స్త్రీ పాత్ర ఉంటుందని స్పష్టం చేశారు. భారత ప్రభుత్వం 'బేటీ బచావో బేటీ పఢావో'' ఉజ్వల, మహిళా శక్తి కేంద్రాలు వంటి మహిళా సాధికారత పథకాలను అమలు చేస్తోందన్నారు. తన తల్లి, భార్య తన ఉన్నత స్థితికి ఎంతో తోడ్పాటు అందించారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కె.లతామాధరి, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కె.తులసి, ఉపాధికల్పనాధికారిణి వసంతలక్ష్మి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్ లక్ష్మి, సాంఘిక సంక్షేమ అధికారి జి.జ్యోతిలక్ష్మిదేవి, డీఈఓ ఎం.కమలకుమారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగలక్ష్మి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. సోషల్ బిహేవియర్ చేంజ్ అంశంలో కీలకంగా వ్యవహరించి విశిష్ట సేవలందించిన మహిళలకు ప్రశంసా పత్రాలు, అందించి సత్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్, సీడీపీఓలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



విశిష్ట సేవలందించిన మహిళా అధికారులకు మెమెంటోలు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టర్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు. పక్కన కలెక్టర్ శుక్లా

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగినులతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉద్యోగులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త పద్మశ్రీ రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వర రావు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాసంశెట్టి సుభాష్, కేసులో బాధితులు

అమలాపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అమలాపురం అల్లర్ల ఘటన కేసులకు ముగింపునిస్తామని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మిధున్‌రెడ్డి పిల్లంకలో ప్రకటించటంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ రాష్ట్ర యువజ విభాగం కార్యదర్శి వాసంశెట్టి సుభాష్, కేసుల్లో ఉన్న బాధితులు స్థానిక శ్రీరామపురంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సుభాష్, శెట్టిబలిజ సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అల్లర్ల ఘటనలో అమాయకులు ఉన్నారని గమనించిన ముఖ్యమంత్రి కేసుల ఉపసంహరణ ప్రక్రియకు ముందుకు రావడం హర్షణీయం అన్నారు. తామంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వనుము సత్య కళ్యాణి, ఎంపీటీసీ సభ్యుడు అడపా సత్తిబాబు, దొంగ అంజనేయులు, పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం, మేడిశెట్టి ఇజ్రాయిల్, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో ఎడారి



ఎడారిని తలపిస్తున్న చిర్రయానం పర్రభూమి

పచ్చనిసీమ ఎడారిని తలపిస్తోంది. కాట్రేనికోన మండలం చిర్రయానం వద్ద వేలాది ఎకరాల్లో విస్తరించిన ఈ పర్రభూములు జలసిరులతో కళకళలాడుతూ ఉంటాయి. వందల మంది మత్స్యకారులు వేట సాగిస్తుంటారు. అటువంటి పర్రభూమి నీరు ఎండిపోయి ఇలా ఎడారిలా మారిపోయింది. గౌతమీ నదీపాయ, కూనవరం మొగ ద్వారా పోటు సమయంలో సముద్రపు నీరు చేరుతోంది. వీటితోపాటు అపార మత్స్య సంపద కూడా వస్తోంది. వేసవికి తోడు... ఆక్వా చెరువుల పుణ్యమాని పర్రభూమి ఎటుచూసినా ఇసుక తిన్నెలతో ఎడారిని తలపిస్తోంది.

– సాక్షి, అమలాపురం

వెంకన్నకు రూ.2 లక్షల విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామికి ఈదరపల్లికి చెందిన ఉద్దీశ పల్లంరాజు, సూర్యావతిల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్, సత్యవేణి దంపతులు రూ.2 లక్షల విరాళంగా ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవికి మంగళవారం అందించారు.



దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న చైర్‌పర్సన్

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

- 200 మందితో పార్టీలోకి ప్రకాశ్‌రెడ్డి
- సాదరంగా ఆహ్వానించిన మంత్రి వేణు



పార్టీలో చేరిన ప్రకాశ్‌రెడ్డి తదితరులకు కేక్ తినిపిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ నేత కూనిశెట్టి సూర్యప్రకాశ్‌రెడ్డి 200 మంది తన అనుచరులు, అభిమానులతో కలసి తెలుగుదేశం పార్టీని వీడి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వేణు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సోమవారం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిధున్‌రెడ్డి 2024లోనూ తననే రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన మరుసటి రోజునే సీనియర్ నాయకుడు ప్రకాశ్‌రెడ్డి తన అనుచరులతో పార్టీలో చేరడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు ముందు నుంచీ పార్టీకి సేవలందిస్తున్న నాయకులతో సమన్వయంతో పనిచేసి 202 లో పార్టీకి తిరుగులేని విజయం అందించేలా కృషి చేయాలని కోరారు. కూనిశెట్టి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందరినీ కలుపుకుని ముందుకు వెళుతూ నియోజకవర్గంలో మంత్రి వేణు అందిస్తున్న సేవలు తనను ఆకర్షించాయన్నారు. పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. ప్రకాశ్‌రెడ్డి అభిమానులు గ్రామంలో భారీ స్థాయిలో బాణసంచా కాల్చి, తీన్‌మార్ డప్పులతో సందడి చేశారు. మంత్రి వేణు కేక్ కట్ చేసి పార్టీలో చేరిన వారికి తినిపించారు. పార్టీలో చేరిన వారిలో పెట్టా చిట్టిబాబు, పిల్లి శ్రీనివాసరావు, రాయుడు రమాదేవి, కూతా జార్జిరెడ్డి, బుంగ రాజు ఉన్నారు. గ్రామ సర్పంచ్ పలివెల లోవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు యెన్నం దేవి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం సుబ్బారావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రానికి దౌర్భాగ్యపు ప్రతిపక్ష నేత చంద్రబాబు



మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: రాష్ట్ర అభివృద్ధిని చూడలేక అడ్డగోలు ప్రకటనలు చేస్తున్న చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి దౌర్భాగ్యపు ప్రతిపక్ష నేత అని బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి వేణు మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అని అందరూ చెబుతుంటే చంద్రబాబు ఓర్చుకోలేని తనంతో వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని కళ్లుండి చూడలేక ప్రతిపక్షం, పచ్చమీడియా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి ముగ్గురు మంత్రులు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విధానాలను పొగుడుతుంటే ఇక్కడి ప్రతిపక్షం మాత్రం ఏదోవిధంగా విమర్శలు చేయాలని చూస్తోందని మంత్రి వేణు దుయ్యబట్టారు. అభివృద్ధిని అడ్డుకోవటమే లక్ష్యంగా చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ పనిచేస్తున్నారన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య హోలీ



- రసాయన రంగులకు దూరంగా ఉంటే మేలు
- నేడు వసంతోత్సవం



హోలీ జరుపుకుంటున్న చిన్నారులు

బిక్కవోలు: ఫాల్గుణ మాసం పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్లు వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో వయోభేదాలకు అతీతంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ హోలీ. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ పండగను ముఖ్యంగా ఉత్తర భారతీయులు ఎంతో సంబరంగా జరుపుకుంటారు. ఇప్పుడు అన్ని ప్రాంతాల్లోనూ ఈ పండగ సంబరాన్ని ఆనందోత్సాలతో జరుపుకుంటున్నారు. పిల్లాపెద్దా తేడా లేకుండా రంగులు పులుముకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలుతున్నారు.

పురాణ కథ

హోలీ పండగ వెనుక పురాణ కథ ఉంది. హోలీ అనే రాక్షసి పసిపిల్లల ప్రాణాలు హరిస్తూ కడుపు నింపుకునేది. బిడ్డల తల్లిదండ్రులు గర్భశోకంతో ఆగ్రహించి మూకుమ్మడిగా ఆ రాక్షసిని అంతమొందిస్తారు. హోలీ మరణించడంతో ఈ సందర్భాన్ని హోలీగా నిర్వహిస్తారనేది ఒక కథనం.

ఆనందంతో పాటు ఆరోగ్యం

ఒకప్పుడు పూలు, పండ్లు ద్వారా వచ్చిన రంగులనే వేడుకల్లో వాడేవారు. పండగకు ఒకరోజు ముందు అడవికి వెళ్లి మోదుగుపూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చే ఎర్రని ద్రావణంలో పసుపు, కుంకుమ కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు జరుపుకునేవారు. కాల క్రమంలో ఆ రంగులపోయి వార్నిష్, సింథటిక్ రంగులను చల్లుకుంటున్నారు. అవి ప్రమాదకరమని తెలిసినా..వాడుతూనే ఉన్నారు. అయితే హోలీ ఆడటంలో కూడా జాగ్రత్తలు తీసుకోక తప్పదని చర్మవ్యాధుల నిపుణులు సూచిస్తున్నారు. రసాయన రంగులను కాకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా చర్మానికి హాని జరగకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

ఈ సూచనలు పాటిస్తే మేలు

- రసాయన రంగులైన లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యురీ సల్ఫేట్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. అవి కళ్లలో పడితే చూపు పోయే ప్రమాదం ఉంది.
- గులాల్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం ఉంది. గూలాల్ వంటి రంగులతో ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి.
- రసాయనాలు కలసిన రంగులతో హోలీ ఆడితే కనుక వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయకూడదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి.

చిన్న పిల్లలకు రంగులను దూరంగా ఉంచాలి



చాలామంది సరదా కోసం హోలీ పండగలో చిన్నపిల్లలను కూడా ఉండేలా చేస్తారు. కానీ చిన్న పిల్లలను దూరం చేయాలి. రంగులవారి మీద పడితే కంటి సమస్యలు, చర్మవాధులు వస్తాయి. రంగులు నోటిలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది కనుక వారిని జాగ్రత్తగా చూడాలి.

– పులగం రామానందసాగర్, వైద్యులు, అనపర్తి

- ఎరుపు,పింక్ రంగులనే హోలీ కోసం వాడాలి. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండటం వల్ల శరరంపై నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉన్న కారణంగా సులభంగా శరీరంపై నుంచి తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనెను రాసుకోవాలి. దీనివల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. రంగులను శుభ్రం చేయడం కూడా సులభమవుతుంది.
- ముఖ్యంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- చాలామంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలుపుతారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఎటువంటి ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అడ్డుకోవచ్చు.

ఎల్ఐసీ సంఘ కార్యవర్గం



రాంబాబు



కోదండరామ్

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా జి.రాంబాబు, ఎం.కోదండరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు పి.సతీష్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జేఎన్ రోడ్డులోని సూర్య గార్డెన్స్‌లో జరిగిన 26వ వార్షిక మహాసభలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్, ఐవీ సుధాకర్, సత్యదేవ, సహాయ కార్యదర్శులుగా మాథ్యూస్, భరణి, సుబ్బారావు, కోశాధికారిగా ఈశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా గన్నెయ్య, పీఎస్ఎన్ రాజు, సాయిబాబా, రామకృష్ణ, ఉమాదేవి, రమేష్ బాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పూర్వపు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఐఎఫ్ బెనర్జీ, పి.సతీష్ అభినందించారు. పూర్వపు ఉభయగోదావరి గోదావరి జిల్లాలకు చెందిన 20 శాఖా కార్యాలయాలు, రాజమహేంద్రవరం డివిజనల్ ఆఫీస్‌తో కలిపి ఈ నాయకత్వం పనిచేస్తుందన్నారు.

ఆమె ధైర్యం.. ఒక సైన్యం

▸ ఏడవ పేజీ తరువాయి

సంక్షేమశాఖకు పీడీగా కె.ప్రవీణ తదితర మహిళా అధికారులు పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి..బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ఏ కార్యాలయానికి వెళ్లినా మహిళామూర్తి అధికారిగా కనిపిస్తున్నారు. 24 గంటలూ పాలనా వ్యవహారాలతో బిజీగా కనిపించే ఈ మహిళా అధికారులు తమ ఇళ్లను చక్కబెట్టుకోవడంలోనూ ప్రధాన భూమిక పోషిస్తున్నారు.

కుట్టుమెషీన్‌తో బతుకు బండిని పట్టాలెక్కించి..



టైలరింగ్‌లో మెళకువలు నేర్పిస్తున్న గంగాభవానీ

రామచంద్రపురం: విధి ఆడిన వింత నాటకంతో ఆమె నిరాశ చెందలేదు. హఠాత్తుగా మీద పడ్డ కుటుంబ భారాన్ని మోస్తూ మొక్కవోని దీక్షతో జీవితాన్ని జయించింది పట్టణానికి చెందిన మీసాల గంగాభవాని. భర్త మీసాల వీరవెంట సత్యనారాయణ (దొరబాబు) టీవీ మెకానిక్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇద్దరు ఆడపిల్లలతో ఆనందంగా ఉండేవారు. భర్త సత్యనారాయణను గుండెపోటు రూపంలో మృత్యువు కబళించింది. ఇద్దరు ఆడపిల్లలతో తన ముందు ఉన్న సవాళ్లను ఎలా ఎదుర్కొనాలనే ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి. వివాహానికి ముందు సరదాగా నేర్చుకున్న టైలరింగ్‌ను జీవనోపాధికి మార్గంగా ఆమె ఎంచుకుంది. అందులో మెళకువలను నేర్చుకుంటూ కుట్టుమెషీన్ ద్వారా బతుకు బండిని పట్టాలెక్కించింది. డ్వాక్రా ద్వారా రుణం తీసుకుని టైలరింగ్‌తో పాటుగా బ్యూటీషియన్‌గా కూడా తనకంటూ పేరు తెచ్చుకుంది. మహిళలకు టైలరింగ్ నేర్పిస్తూ మార్గదర్శకంగా నిలిచింది. తన పిల్లలకు తండ్రి, తల్లి తానే అయి ఆత్మ స్థైర్యాన్ని నింపుతూ ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూ పెద్ద అమ్మాయి వీరవెంట లక్ష్మి పద్మావతిని సీఏ (చార్టెర్డ్ అకౌంటెంట్) చదివించింది. వివాహం చేసి అత్తారింటికి పంపించింది. రెండవ అమ్మాయి బీటెక్ చేసి ఉద్యోగం చేస్తోంది. ఇలా ఇద్దరి పిల్లలను తన రెక్కల కష్టం మీద చదివించి ఒక దారికి తీసుకువచ్చింది గంగాభవాని. సమస్యల చుట్టిముట్టినప్పుడు కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగి ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలిచింది.

నైపుణ్యమే ఆసరా అవుతుంది

ప్రతీ యువతి చదువుతో పాటుగా ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉంటే అది ఏరకంగానైనా మనకు ఆసరా అవ్వొచ్చు. ఇది నాకు జీవితం నేర్పిన పాఠం. ఇప్పటివరకు అద్దె ఇంటిలోనే ఉంటున్న నాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– మీసాల గంగాభవానీ

కుటీర పరిశ్రమతో తోటివారికీ ఉపాధి

మలికిపురం: ఆమె పేరు తోట ఉమా మహేశ్వరి. మలికిపురం మండలం కేశనపల్లి స్వగ్రామం. కొన్ని విపత్కర పరిస్థితులలో కుటుంబ పోషణ ఆమెపై పడింది. ఆమె ఇద్దరు కుమార్తెలను చదివిస్తోంది. ఉపాధి అవకాశం కోసం వెతుకుతున్న తరుణంలో యూట్యూబ్‌లో జూట్ బ్యాగ్‌ల తయారీ ఆమె కంట పడింది. ఆమెకు తండ్రి అడబాల ఆంజనేయులు, సోదరులు అండగా నిలిచారు. గత ఏడాది అమరావతి వెళ్లి స్నేహితులతో కలిసి శిక్షణ పొందింది. వివిధ పాఠశాలల, వ్యాపార సంస్థలలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్‌ల వినియోగంపై ఆమె అవగాహన పెంచుతూ తన బ్యాగుల వ్యాపారం కోసం కృషి చేస్తోం. ఆమె కృషికి ఓఎన్జీసీ సహకారం అందించింది. ఇటీవల వేయి బ్యాగులకు ఆర్డర్ ఇచ్చింది. గెయిల్ మరో పది వేల బ్యాగుల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. బ్యాగులతో పాటు వివిధ గృహోపకరణాల తయారీ కూడా ఆమె చేపట్టింది.



జూట్ బ్యాంగుల తయారు చేస్తున్న ఉమా మహేశ్వరి

మానసిక దివ్యాంగులకు ప్రేమాలయం 'సిరి'



మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న గోపీదేవి



2017లో బెంగళూరులో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఇండియా నుంచి సేవారత్న అవార్డు పొందిన గోపీదేవి

సామర్లకోట: నిరుపేద మానసిక దివ్యాంగులకు సేవ చేయాలనే సంకల్పంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1994లో సామర్లకోటలో బడేలమ్మ చెరువు ఎదురుగా 'సిరి'సంస్థను గోపీదేవి స్థాపించారు. శ్రీకాకుళంలో బీఏ పట్టా తీసుకున్న అనంతరం ఆమె మెంటల్ రిటార్డేషన్‌లో డిప్లమా కోర్సు చేశారు. తండ్రి దాశెట్టి సూర్యకుమార్ ఇచ్చిన రూ.రెండు లక్షలతో తాతయ్య అప్పలరాజు స్వస్థలమైన సామర్లకోటలో మానసిక వికలాంగుల సేవాసంస్థ 'సిరి'ని స్థాపించారు. 2000 సంవత్సరంలో సిరికి ప్రభుత్వ గుర్తింపు లభించింది. మతిస్థిమితం లేని బాలబాలికలకు ఉచిత విద్య, భోజనం, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, శారీ పెయింటింగ్, సర్ఫ్ తయారీ, రీడింగ్, రైటింగ్, వృత్తి విద్యలలో శిక్షణ వంటివి కొనసాగిస్తున్నారు.

మానసిక సంతృప్తి

మా సంస్థ సేవలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 పర్యాయాలు 'బెస్ట్ సోషల్ వర్కర్'అవార్డులను ప్రదానం చేశాయి. మానసిక పరిపక్వత లేని 5–15 సంవత్సరాల బాలబాలికలకు వృత్తి పరమైన శిక్షణ ఇస్తూ శిక్షణ పొందిన విద్యార్థులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తున్నాం. దాతల ద్వారా సేకరించిన విరాళాలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి ఆ మొత్తం మీద వచ్చే వడ్డీతో పిల్లలకు జీవిత కాలం భోజన వసతి కల్పిస్తున్నాం. 150 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. నిరుపేద మానసిక దివ్యాంగులకు చేయూత నివ్వటం ద్వారా ఆ భగవంతుడికే సేవ చేసినట్లు మానసిక సంతృప్తి లభిస్తోంది.

– డి.గోపీదేవి, సిరిమానసిక దివ్యాంగుల కేంద్ర వ్యవస్థాపకులు, సామర్లకోట

నెలాఖరుకు భట్నవిల్లి - పేరూరు బైపాస్ రోడ్డు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: భట్నవిల్లి–పేరూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, కాంట్రాక్టర్లకు రోడ్డు నిర్మాణం, వాహనదారుల భద్రతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఎర్ర వంతెన సమీపంలో డివైడర్లు, సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యంపై జాతీయ రహదారుల ఇంజినీర్లతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లా ప్రధాన కేంద్రం అమలాపురం పట్టణంలో ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సాయి శ్రీనివాసు, సహాయక ఇంజినీర్ పురుషోత్తం తహసీల్దార్ పరమట శ్రీపల్లవి పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారికి చక్రస్నానం

కళకళలాడిన కోరుకొండ దేవుని కోనేరు



దేవుని కోనేరులో లక్ష్మీ నరసింహస్వామి, అనంత పద్మనాభ స్వామి, చక్ర పెరుమాళ్ల స్వామి వార్ల చక్రస్నానం

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం స్వామివార్లకు చక్ర స్నానం ఘనంగా జరిగింది. ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. దానిలో భాగంగా నారసింహుడు, అనంత పద్మనాభ స్వామి, చక్ర పెరుమాళ్ల స్వాములకు స్థానిక దేవుని కోనేరులో ఉదయం చక్రస్నానం జరిగింది. ముగ్గురు స్వాములను పల్లకీలపై గిరి ప్రదక్షిణంగా స్వామివారి కోనేరు వద్దకు తీసుకొచ్చి ఆస్థాన పర్చారు. అనంతరం చక్రతీర్థం ఘనంగా జరిగింది. దీనికిముందు అర్చక స్వాములు విష్వక్సేనారాధనం, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం చక్ర తీర్థం నిర్వహించారు. దేవస్థానం ఫౌండర్ ఎస్వీ రంగరాజభట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, అన్నవరం దేవస్థానం ట్రస్టీ మెంబర్ తాడి రజనీ రెడ్డి, సూపరింటెండెంట్ బి.సత్య శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, కళ్ల వీరబాబు, నేతుల చిన్ని, కేతినేడి అశోక్, కటకం బాబ్జి పాల్గొన్నారు.

No.A.8771/DHFWS/OSD/A2/2022-23/304

GOVERNMENT OF PUDUCHERRY

DIRECTORATE OF HEALTH AND FAMILY WELFARE SERVICES

Puducherry dated 06/03/2023

Walk in Interview for the post of Neuro Technician on contract basis for a period of 11 months

The Government of Puducherry, Indira Gandhi Government General Hospital and Post Graduate Institute, Department of Neurology requires one Neuro Technician. The candidates from the residence of **Puducherry/Karaikal/Mahe&Yanam Region** possessing required qualifications may attend the Walk-in-Interview on **27/03/2023** from 9.30 AM to 5.30 PM in the Chamber of the **Director of Health and Family Welfare Services, Rue Victor Simonel Street, First Floor, Old Maternity Hospital Building, Puducherry - 605001.** The candidates should bring all original certificates, one set of attested photocopies of their qualifications and details of experience alongwith one photographs and signed curriculum vitae.

Name of the post	Qualification	No.of vacancies	Age Limit	Remuneration per month
Neuro Technician	i) Degree in Neuro technology from a recognized university/ institution or equivalent ii) Three years experience in handling EEG/ENMG/ Doppler Machines in a Hospital (OR) i) Two years Diploma in Neuro technology from a recognized University / Institution ii) Four years experience in handling EEG/ENMG/ Doppler Machines in a Hospital	1	upto the age of 30 years	Rs. 18,000/- per month

//BY ORDER OF THE SECRETARY (HEALTH)//
DIRECTOR (HEALTH)